జిమ్మీ వాలెంటైన్ జైలు షూ షాపులో శ్రద్ధగా చెప్పులు తుడుచున్నప్పుడు అక్కడికో జైలు గార్డు వచ్చాడు. జైలు ముందుభాగంలో ఉన్న ఆఫీసుకు అతన్ని వెంటబెట్టుకువెళ్లాడు. ఆ రోజు పొద్దున గవర్నర్ సంతకం చేసి పంపిన క్షమాపత్రాన్ని వార్డెన్ అతనికి అందించాడు. జిమ్మీ మహావిసుగ్గా దాన్నందుకున్నాడు. నాలుగేళ్ల శిక్షాకాలంలో సుమారుగా పది నెలల జైలు జీవితం అతను అనుభవించాడు. మహా అయితే ఓ మూడు నెల్లు జైల్లో ఉండాల్సి వస్తుందేమోననుకున్నాడు. బయట ఎంతోమంది స్నేహితులున్న జిమ్మీ వాలెంటైన్‌కు ఇక్కడ ఇంత కాలం ఉండటం కూడా ఎక్కువే.

"వాలెంటైన్, నిన్ను రేపు పొద్దున్న విడుదల చేస్తున్నాం. జీవితాన్ని బాగు చేసుకో. నువ్వు చెడ్డమనిషివి కావు. ఇనప్పెట్టెలు, బొక్కసాలు కొల్లగొట్టడం మానెయ్. బాగుపడిపోతావు" అన్నాడు వార్డెన్.

"నేనా?" అన్నాడు జిమ్మీ ఆశ్చర్యపోతూ, "నా జీవితంలో నేనెప్పుడూ ఇనప్పెట్టెల జోలికి పోలేదు!"

"అవును, పాపం!"-నవ్వాడు వార్డెన్. "నువ్వు అమాయకుడివి. మరి ఆ స్ప్రింగ్ ఫీల్డ్ కేసులో నిన్నిక్కడి కెందుకు పంపించారు? హై సొసైటీలోని పెద్దమనిషి నెవర్నో బయటపెట్టడం ఇష్టం లేకనేనా కోర్టులో అమాయకత్వాన్ని వెల్లడించంది! లేక దుర్మార్గులైన ముసలి జూరీ సభ్యులు నీ పట్ల కసితో చేసిన పనా ఇది? పాపం, మీలాంటి అమాయకులకు అదో, ఇదో కారణమై వుంటుంది."

"నేనా?" అన్నాడు జిమ్మీ తన సచ్చరితాన్ని వెల్లడించేటట్లు. "నేనెప్పుడూ నా జీవితంలో స్ప్రింగ్ ఫీల్డ్ ముఖం చూడలేదు!"

"క్రోనిక్, అతన్ని తీసుకెళ్లు. బయటికెళ్లేందుకు అతని బట్టలివ్వు. పొద్దున ఏడింటికి అతన్ని విడుదల చెయ్యి" అని గార్డుకు చెప్పి, "నా సలహా మనసులో పెట్టుకో, వాలెంటైన్!" అన్నాడు వార్డెన్.

మర్నాడు పొద్దున్న ఏడుంపావుకి జిమ్మీ వార్డెన్ ఆఫీసు బయటికొచ్చి నిలబడ్డాడు. ప్రభుత్వం విడుదలైన నిర్బంధఅతిథులకిచ్చే బిగుతు రెడీమేడ్ గుడ్డ లేసుకున్నాడతను. ప్రభుత్వం ఇచ్చిన షూజ్ కిర్రుమంటున్నాయి. క్లర్కు అతనికి రైలు టిక్కెట్టు, ఐదు డాలర్ల నోటు ఇచ్చాడు. వాటితో అతను మంచి పౌరుడుగా, సుఖసంపదలతో అలరారేటట్లు పునరావాసం కల్పించుకోవాలని ప్రభుత్వం ఆశించింది.

వార్డెన్ అతనికో సిగరెట్టిచ్చాడు, వీడ్కోలు పలికాడు. ఖైదీ నంబరు 9762, వాలెంటైన్ పేరుకు ఎదురుగా 'గవర్నరు క్షమాభిక్ష' అని నమోదు అయింది. ఇంక జేమ్స్ వాలెంటైన్ వెచ్చటి బయటి ఎండలోకి నడిచాడు.

పచ్చటి చెట్ల మీద పక్షుల కువకువలనూ, పూల సుగంధాన్నీ లెక్కించకుండా జిమ్మీ సరాసరి రెస్టారెంట్‌కు దారి తీశాడు. అక్కడ బ్రాయిల్డ్ చికెన్ తింటూ, వైట్ వైన్ తాగుతూ, తన స్వేచ్ఛాజీవితంలోని ప్రథమానందమధురిమ ననుభవించాడు. ఆ తర్వాత వార్డెనిచ్చిన సిగరెట్టు కంటే మంచి బ్రాండు సిగరెట్టు

# సంస్కరణ

ఆంగ్లమూలం: ది రిట్రీవ్డ్ రిఫార్మ్: ఓ. హెన్రీ
తెలుగు అనువాదం: కాకాని చక్రపాణి



నొకదాన్ని ముట్టించాడు. అక్కడ నుంచి తీరిగ్గా నడుచుకుంటూ రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. తలుపు పక్క కూర్చున్న గుడ్డి బిచ్చగాడి హాట్‌లోకి ఓ పావలా విసిరేసి, బండి ఎక్కి కూర్చున్నాడు. మూడు గంటల ప్రయాణం తర్వాత ఓ స్టేషన్‌లో దిగాడు. మైక్ డొలాన్ కఫేకు వెళ్లాడు. కౌంటర్ ముందు ఒంటరిగా కూర్చునున్న మైక్‌తో చెయ్యి కలిపి పలకరించాడు.

"సారీ, జిమ్మీ! ఇంతకంటే ముందు మేం నిన్ను విడుదల చేయించలేకపోయాం. స్ప్రింగ్ ఫీల్డ్ జనం వ్యతిరేకత చూసి, నిజానికి గవర్నర్ ఖంగుతినిపోయాడు. మన పనవ్వదేమో ననుకున్నాము. ఇంతకీ ఎట్లాగున్నావు?" అన్నాడు మైక్.

"చక్కగా ఉన్నాను. నా తాళం చెవి ఎక్కడ?" అడిగాడు జిమ్మీ.

తాళం చెవి తీసుకుని, మెట్లెక్కి పైకి వెళ్లాడు. తన గది వెనుక తలుపు తెరిచి లోపలికి ప్రవేశించాడు. వస్తువులన్నీ తనెలా వదలి వెళ్లాడో అలాగే ఉన్నాయి. బెన్ ప్రైస్ కాల్ బటన్ ఇంకా అలాగే నేల మీద పడుంది. పోలీసులొచ్చి తన్ను అరెస్టు చేయటానికి ప్రయత్నించినప్పుడు, ఆ పెనుగులాటలో ఆ పోలీసు డిటెక్టివ్ చొక్కా గుండీ తెగి కింద పడింది.

గోడకు ఆన్చివున్న మడత మంచాన్ని పక్కకు జరిపాడు జిమ్మీ. గోడకున్న పానెల్‌ను పక్కకు జరిపి, అందులో నుండి దుమ్ము కొట్టుకున్న తన సూట్‌కేస్‌ను తీశాడు. పెట్టె తెరిచి, ఆప్యాయంగా బర్గ్లర్ టూల్స్-దొంగతనానికి పనికివచ్చే పనిముట్ల-వంక చూసుకున్నాడు. తూర్పుదేశంలో అలాంటి చక్కటి పనిముట్లు మరెవరి దగ్గరా లేవు. అది పూర్తి సెట్. ప్రత్యేకమైన స్టీల్‌తో తయారుచేసిన పనిముట్లు. లేటెస్ట్ డిజైన్‌లో ఉన్న డ్రిల్లులు, పంచ్‌లు, బ్రేస్‌లు, బిట్లు, జిమ్మీలు, క్లాంపులు, పిడిసానలు-ఆ పైన జిమ్మియే స్వయంగా తయారుచేసుకున్న రెండు, మూడు కొత్త పరికరాలు అందులో ఉన్నాయి. తను తయారుచేసుకున్న ఆ పనిముట్లంటే జిమ్మికే ఎంతో గర్వంగా ఉండేది. వృత్తిలో ఉండేవారి కోసం, అలాంటి పనిముట్లను తయారుచేసేచోట ఏడొందల డాలర్లకు పైగా ఖర్చుపెట్టి వాటినతను కొన్నాడు.

ఓ అరగంటలో జిమ్మీ మెట్లు దిగి, కఫే హాలు గుండా నడిచివచ్చాడు. ఇప్పుడు అతను వేసుకున్న బట్టలు ఒంటికి సరిగ్గా సరిపోయేట్టుగా ఉన్నాయి. చక్కటి అభిరుచి వెల్లడయ్యేలా ఉన్నాయి. దుమ్ము దులిపి, క్లీన్ చేసిన సూట్‌కేస్ అతని చేతిలో ఉంది.

"డబ్బేమన్నా కావాలా?" అడిగాడు మైక్ డొలాన్ ఆదరంగా.

"నాకా?" అన్నాడు జిమ్మీ ఆశ్చర్యపడిపోతూ,-"నన్నెవరనుకుంటున్నావు? నేను 'న్యూయార్క్ ఎమార్గమేటెడ్ షార్ట్ స్నాప్ బిస్కెట్ క్రాకర్ అండ్ ఫ్రాజిల్డ్ వీట్ కంపెనీ' ప్రతినిధిని!"

అలా అన్నందుకు మైక్ మహదానందపడిపోయాడు. అతన్ని బలవంతం చేసి, పాల సెల్ట్జర్ తాగిందాకా వదల్లేదు మైక్. జిమ్మీ హాట్ డ్రింక్స్ పుచ్చుకోడు.

ఖైదీ నంబరు 9762, వాలెంటైన్ విడుదలైన వారం రోజులకు ఇండియానాలోని రిచ్‌మండ్ పట్నంలో, బాంకు సేఫ్ బద్దలుకొట్టి, కొల్లగొట్టాడు, కర్తృత్వానికి సంబంధించిన ఎలాంటి ఆధారాలూ వదలకుండా. పెద్దగా పోయిందేం లేదు, ఎనిమిది వందల డాలర్లు తప్ప. రెండు వారాల తర్వాత, లోగన్ స్టోర్స్‌లో దొంగలకు లొంగదని నిర్ధారించిన బాంక్ సేఫ్‌ను జున్నులా కోసి, పదిహేను వందల డాలర్లు పట్టుకెళ్లారు; సెక్యూరిటీలనూ, వెండినీ మాత్రం ముట్టుకోలేదు. దాంతో దొంగను పట్టుకునే వాళ్ల గుండె నాకట్టుకున్నట్లయింది. ఆ తర్వాత జఫర్‌సన్ సిటీలోని ఓ పాత బాంకు సేఫ్ తెరిచి, ఐదు వేల డాలర్లను అప్పగించింది.

జరిగిన నష్టాలు పెద్ద మొత్తాలవటంలో బెన్ ప్రైస్ తన వృత్తికి పని కల్పించక తప్పలేదు. జరిగిన చోరీలను నిశితంగా పరిశీలించాక చోరీ పద్ధతుల్లో ఓ చక్కటి పోలిక కనిపించింది. బెన్ ప్రైస్ చోరీ జరిగిన ప్రదేశాలకు వెళ్లి పరిశోధన సాగించాడు. ఆ తర్వాత చెప్పాడు-"ఆ సోగ్గాడు జిమ్ వాలెంటైన్ సంతకం స్పష్టంగా కనిపిస్తోంది. అతను మళ్లీ బిజినెస్ మొదలెట్టాడు. ఆ



ఆ నిశ్శబ్దంలో
ఆ పిల్ల చీకటిగదిలో
భయంతో గుక్క పట్టి ఏడుస్తున్న
ధ్వని చాలా అస్పష్టంగా
వినవచ్చింది.
'అయ్యో, నా తల్లీ!"-అంటూ పెద్ద
శోకం పెట్టిందా తల్లి.

కాంబినేషన్ నాబ్ వంక చూడండి. చిత్తడి నేల నుండి మొక్కను గుంజి దుంపతో సహా పెళ్లగించినట్లుంది. ఆ పని చేయగల క్లాంపులు అతని దగ్గరే ఉన్నాయి. ఆ టంబ్లర్లకు ఎంత క్లీన్‌గా బెజ్జం వేశాడో చూడండి. జిమ్మీ ఒక్క రంధ్రం చేస్తే చాలు. నాక్కావలసిన మనిషి వాలెంటైనే. ఈ సారి స్వల్పకాలికశిక్షలు, దయాభిక్ష ల్లాంటి తెలివిమారిన పనులు జరగవు!"

బెన్ ప్రైస్‌కు తెలుసు జిమ్మీ అలవాట్లు. స్ప్రింగ్ ఫీల్డ్ కేసు పరిష్కరించే సందర్భంగా అతను వాటిని క్షుణంగా తెలుసుకున్నాడు. దూరప్రదేశాల్లో చోరీ, పనవంగానే క్షణంలో మాయమవటం, సహాయకుల్లేకుండా ఒంటరిగా పని పూర్తి చేసెయ్యటం, చక్కటి సామాజికాభిరుచి-ఈ మార్గాలు అతన్ని చట్టానికి దొరక్కుండా చేశాయి. పట్టుకు చిక్కకుండా జారిపోయే ఈ మనిషి జాడ తెలుసుకోవడానికి బెన్ ప్రైస్ పయనమయ్యాడని తెలిసి, దొంగలకు లొంగవని నిర్ధారించిన సేఫ్ యజమానులు ఊపిరి పీల్చుకున్నారు.

ఓ రోజు మధ్యాహ్నం జిమ్మీ వాలెంటైన్, తన సూట్‌కేస్‌తో పాటు ఎల్మోర్‌లో కాలు పెట్టాడు. అది ఆర్కెన్ శాస్ కౌంటీలో రైల్వే లైనుకు ఐదు మైళ్ల దూరంలో ఉన్న ఓ చిన్న పట్నం. అప్పుడే కాలేజీ నుంచి బయటపడ్డ సీనియర్ అథ్లెటిక్ యువకుడిలా అతను రోడ్డు పక్కనున్న హోటల్‌కు దారి తీశాడు.

ఓ యువతి రోడ్డు దాటి, అతని పక్క నుంచీ వెళ్తూ, ఆ వీధి మూలగా ఉన్న బిల్డింగ్‌లోకి వెళ్లింది. ఆ బిల్డింగ్ పైన 'ది ఎల్మోర్ బాంక్' అని బోర్డు రాసుంది. జిమ్మీ వాలెంటైన్ ఆమె కళ్లల్లోకి చూశాడు, తనెవరో మరిచిపోయాడు. మరో మనిషైపోయాడు.

ఆమె అతన్ని చూసి కళ్లు కిందకు వాల్చింది, బుగ్గలు కొద్దిగా ఎరుపెక్కాయి. జిమ్మీలా అందంగా ఉండే యువకులు ఎల్మోర్‌లో కొద్దిమందే.

బాంక్ మెట్ల మీద పచార్లు చేస్తున్న ఓ పిల్లవాడిని పట్టుకుని, తనో స్టాక్ బ్రోకర్‌లా పట్నాన్ని గురించి ప్రశ్నలు వేయసాగాడు, అప్పుడప్పుడు వాడి చేతిలో డబ్బులు పెడుతూ.

అంతలో ఆ యువతి రాయంచలా నడుస్తూ బాంక్‌లో నుంచి బయటకు వచ్చింది. సూట్‌కేస్ పట్టుకున్న యువకుడిని చూడలేదామె. తన దారిన తాను పోయింది.

"ఆ అమ్మాయి పాలీ సింప్సన్ కదూ?"-అనడిగాడు జిమ్మీ, కపటపు చిరునవ్వు నవ్వుతూ.

"కాదు. ఆ అమ్మాయి అన్నీబెల్ ఏడమ్స్. వాళ్లయ్యదే ఈ బాంకు. నువ్వు ఎల్మోర్ కెం[illegible]టావు? అది బంగారం గడియారం గొలుసేనా? పైనలేమన్నా వున్నయ్యా?" అన్నాడు పిల్లవాడు.

జిమ్మీ ప్లాంటర్స్ హోటల్‌కు వెళ్లాడు. రాల్ఫ్ డి. స్పెన్సర్ అని తన పేరు నమోదు చేయించుకుని, ఓ గది తీసుకున్నాడు. డెస్క్ మీదకు ఆనుకుని, క్లర్కుకు తన సంగతి చెప్పాడు. బిజినెస్ చేయటానికి అనువైన జాగా వెతుక్కుంటూ తను ఎల్మోర్ వచ్చినట్టు చెప్పాడు. ఇప్పుడు పట్నంలో షూ బిజినెస్ ఎలాగుంది? షూ బిజినెస్ పెట్టాలనే తన ఆలోచనకు ప్రయోజనముంటుందా?

జిమ్మీ ధరించిన బట్టలూ, అతని ప్రవర్తనా చూసి గుమాస్తా ముగ్ధుడైపోయాడు. ఎల్మోర్ పట్నంలో అంతగా ఫాషన్ తెలియని యువతలో మెరుగైన మనిషి అతను. అయితే, తన లోపాలు అతనికి తెలుసు. జిమ్మీతో స్నేహం చేద్దామన్న కోరికతో అతను ఆనందంగా సమాచారాన్ని అందించాడు.

అవును. లెదర్ బిజినెస్‌కు పట్నంలో మంచి అవకాశాలే వున్నాయి. చెప్పులు, షూజ్‌కని ప్రత్యేకించి ఓ స్టోర్ లేదు పట్నంలో. జనరల్ గూడ్స్ షాపులే వాటిని అమ్ముతున్నాయి. ఇక్కడ ఏ లైనులోనైనా బిజినెస్ బాగానే ఉంది. స్పెన్సర్‌గారు ఎల్మోర్‌లో బిజినెస్ ప్రారంభించాలని ఆశిస్తాడు తాను. హాయిగా జీవితం గడపటానికి తగిన పట్నం అది. జనం కూడా స్నేహభావంతో ఉంటారు.


కొన్ని రోజులు ఆ పట్నంలో ఉండి, పరిస్థితిని అంచనా వేయాలనుకుంటున్నాడు స్పెన్సర్. లేదు, గుమస్తా బాయ్‌ని పిలవాల్సిన అవసరం లేదు. తన సూట్‌కేస్‌ను తనే తీసుకెళ్తాడు, అది కాస్తంత బరువు.

జిమ్మీ వాలెంటైన్ కాలి బూడిదై పోగా-పోయి, ఆ బూడిద నుంచి పునర్జీవించిన ఫోనిక్ పక్షి (ఐదారొందల ఏళ్లు బతుకుందని నమ్మకం. కాల్చుకుని చనిపోయి, ఆ బూడిద నుంచి పునర్యవ్వనంతో మరో జీవితచక్రాన్ని ప్రారంభించే పక్షి) లాంటి రాల్ఫ్ స్పెన్సర్ ఎల్మోర్‌లోనే ఉండిపోయాడు. బాగా అభివృద్ధిలోకి వచ్చాడు. షూ స్టోర్‌ను ప్రారంభించాడు. వ్యాపారం బాగా నడిచింది.

సామాజికంగా కూడా మంచిపేరు తెచ్చుకున్నాడు. చాలామందితో స్నేహం చేశాడు. తన హృదయంలోని కోరికను కూడా తీర్చుకున్నాడు. అన్నీబెల్‌ను కలిశాడు. ఆమె ఆకర్షణలో తల్లకిందులైపోయాడు.

ఏడాది గడిచాక రాల్ఫ్ స్పెన్సర్ పరిస్థితి ఇలా ఉంది. సమాజంలో అతని పేరుప్రతిష్ఠలు ఇనుమడించాయి. పెద్దల గౌరవమన్ననలకు పాత్రుడయ్యాడు. అతని షూ స్టోర్ బాగా అభివృద్ధి చెందింది. అతనూ, ఆపెళ్లి చేసుకోబోతున్నారు. పరిశ్రమలో పైకొచ్చిన గ్రామీణబాంకు యజమాని, ఏడమ్స్ అతన్ని అల్లుడుగా చేసుకోవటానికి అంగీకరించాడు. అన్నీబెల్‌కు అతని పట్ల ఎంత ప్రేమ వుందో, అతన్ని చూసి అంత గర్వమూ కలిగేది. ఆడమ్స్ కుటుంబంలోనూ, అన్నీబెల్ కుటుంబంలోనూ ఒక సభ్యుడుగా కలిసిపోయాడు స్పెన్సర్.

ఓ రోజు జిమ్మీ తన గదిలో కూర్చుని,



సెయింట్ లూయిస్‌లో ఉన్న తన పాత మిత్రుడికిలా ఉత్తరం రాశాడు.

"ప్రియమిత్రమా, వచ్చే బుధవారం రాత్రి తొమ్మిది గంటలకు సల్లివాన్‌లో 'లిటిల్ రాక్' దగ్గర నువ్వు నన్ను కలుసుకోవాలి. నా కోసం కొన్ని పనులు చేసిపెట్టాలి నువ్వు. నా పనిముట్ల కిట్‌ను నీకు బహుమతిగా ఇద్దామనుకుంటున్నాను. అవి సొంతమవుతున్నందుకు నీకు సంతోషం కలుగుతుంది. నాకు తెలుసు. వెయ్యి డాలర్లు ఖర్చుపెట్టినా నీకలాంటివి దొరకవు. బిల్లీ, నీకు చెప్పాలి-పాత బిజినెస్ సంవత్సరం క్రితం మానేశాను. ఓ మంచి స్టోర్ నడుపుతున్నాను. నిజాయితీగా జీవితం గడుపుతున్నాను. రెండు వారాల్లో ఓ అపురూపసుందరిని పెళ్లాడబోతున్నాను. ఇదొక్కటే జీవితం-బిల్లీ, నిజాయితీ గల జీవితం నాకు ఆకర్షణ కలిగిస్తోంది. మిలియన్ డాలర్లు ఇస్తానన్నా పరాయివాడి సొమ్ము పైసా ముట్టుకోను ఇంక. పెళ్లి చేసుకున్నాక, ఇక్కడి స్టోర్‌ను అమ్మేసి పశ్చిమదేశంలో స్థిరపడాలనుకుంటున్నాను. అక్కడ ఎలాంటి ప్రమాదమూ ఉండదు. పాతకక్షలు తీర్చుకోవాలనే వాళ్లు ఎవరూ అక్కడ ఉండరు. చెప్తున్నాగా, బిల్లీ. ఆమె దేవతే అనుకో. ఆమెకు నాపై అపారవిశ్వాసం. మొత్తం ప్రపంచం నాకిస్తానన్నా నేనిప్పుడింక ఎలాంటి వంకర పనులూ చేయను. సర్లీకి తప్పకుండా రా. నిన్ను కలిసి మాట్లాడాలి. నాతోపాటు పనిముట్లను కూడా పట్టుకొస్తాను.

"నీ పాత మిత్రుడు, జిమ్మీ."

సోమవారం రాత్రి జిమ్మీ ఈ ఉత్తరం రాశాక, బెన్ ప్రైస్ నిరాడంబరంగా గుర్రబ్బండిలో ఎల్మోర్‌కు వచ్చి దిగాడు. తనకు కావలసింది తెలుసుకున్న దాకా నిశ్శబ్దంగా తన పని చేసుకుంటూ పోయాడు. స్పెన్సర్ షూ స్టోర్‌కు ఎదురుగా ఉన్న మందుల దుకాణంలో నుంచి రాల్ఫ్ డి. స్పెన్సర్‌ను పరికించి చూశాడు. 'బాంకు యజమాని కూతుర్ని పెళ్లాడబోతున్నావా, జిమ్మీ, ఏం జరుగుతుందో మరి?' అనుకున్నాడు ప్రైస్ తనలోతాను.

మర్నాడు ఉదయం జిమ్మీ, ఆడమ్స్ ఇంట్లో బ్రేక్ ఫాస్ట్ తీసుకున్నాడు. తన వెడ్డింగ్ సూట్‌ను కుట్టమని ఆర్డరు వేయటానికీ, అన్నీబెల్‌కు మంచి వస్తువేదైనా కొనటానికీ అతనా రోజు లిటిల్ రాక్‌కు వెళ్తున్నాడు. తను ఎల్మోర్‌కు వచ్చాక, అదే మొదటిసారి పట్నం విడిచిపెట్టి బయటికి పోవటం. తన వృత్తికి సంబంధించిన చివరి 'పని' చేసి ఇప్పటికి ఏడాది గడిచింది. అందువల్ల, తను నిర్భయంగా బయటికి రావచ్చుననుకున్నాడు తను.

బ్రేక్ ఫాస్టయ్యాక, కుటుంబమంతా ఊళ్లోకి బయలుదేరారు-ఆడమ్స్, అన్నీబెల్, జిమ్మీ, అన్నీబెల్ అక్కా, ఐదు, తొమ్మిదేళ్లున్న ఆమె ఇద్దరు కూతుళ్లూ. జిమ్మీ ఉంటున్న హోటల్ పక్కగా వెళ్తుంటే, జిమ్మీ తన గదిలోకి వెళ్లి, తన సూట్‌కేస్‌ను తెచ్చుకున్నాడు. ఆ తర్వాత బాంకుకు వెళ్లారు. బాంకు ముందు గుర్రబ్బండిలోనే డాల్ఫ్ గిబ్సన్, జిమ్మీని రైల్వే స్టేషన్‌లో వదలిపెట్టటానికి సిద్ధంగా ఉన్నాడు.

జిమ్మీతోసహా అందరూ బాంకు లోపలికి వెళ్లారు. బాంకు యజమాని కాబోయే అల్లుణ్ని అందరూ ఆహ్వానించారు. అందంగా,

కలుపుగోలుగా ఉండే స్పెన్సర్ అంటే క్లర్క్‌ల కందరికీ ఇష్టం.

జిమ్మీ తన సూట్‌కేస్ కిందపెట్టాడు. అన్నీబెల్ గుండె సంతోషంతో నిండిపోయింది. ఆమె జిమ్మీ హాట్‌ను తన తల పైన పెట్టుకుని, అతని సూట్‌కేస్ అందుకుంది. "అబ్బ, ఇంత బరువుందేంటి రాల్ఫ్? దీన్నిండా బంగారపు ఇటుక లున్నట్టనిపిస్తోంది" అంది.

"నికెల్ ప్లేట్ చేసిన మా హారన్లు చాలా ఉన్నాయి దాంట్లో" అన్నాడు జిమ్మీ ప్రశాంతంగా. "వాటిని వాపసు చేయాలి. ఖర్చు కలిసి వస్తుంది కదాని నాతో తీసుకెళ్తున్నాను. డబ్బును మహాపొదుపుగా వాడుతున్నానులే."

ఎల్మోర్ బాంకు ఆ మధ్యే కొత్త సేఫ్‌నూ, వాల్ట్‌నూ ఏర్పాటు చేసుకుంది. దాన్ని చూసి ఆడమ్స్ కెంతో గర్వంగా ఉంది. అందరూ దాన్ని తప్పక చూడాలని బలవంతం చేశాడతను. డబ్బు దాచే వాల్ట్ చిన్నదే గానీ, దానికో కొత్త తలుపును అమర్చారు. తలుపుకు మూడు గట్టి స్టీల్ బోల్టులు బిగించారు. బయటనున్న ఒక్క హాండిల్‌తో వాటిని ఆపరేట్ చేయొచ్చు. ఆ పైన టైం లాక్ ఏర్పాటు కూడా ఉంది దానికి. ముఖం సంతోషంతో వెలిగిపోతుంటే ఆడమ్స్ అదెలా పనిచేస్తుందో స్పెన్సర్‌కు విశదీకరిస్తున్నాడు.



అతను మర్యాద కోసం ఆయన చెప్పేదంతా విన్నాడు కానీ, దాని పట్ల అతనికేం ఆసక్తి కలుగలేదు. చిన్నపిల్లలు మే, అగాథా ఆ గమ్మత్తైన తాళం, నాబ్‌లు చూసి ఆనందంతో కేరింతలు కొట్టారు.

వాళ్లలా మాట్లాడుకుంటున్న సమయంలో బెన్ ప్రైస్ మెల్లగా బాంకులోకి వచ్చాడు. రెయిలింగ్స్ మీద మోచేతిని ఆన్చి, యథాలాపంగా లోపలికి చూడసాగాడు. తనకు కావలసిందేం లేదనీ, తనకు తెలిసిన మనిషి కోసం ఎదురుచూస్తున్నాననీ అతను టెల్లర్‌కు చెప్పాడు.

అంతలో అకస్మాత్తుగా స్త్రీల ఆక్రందనా, గోలా వినవచ్చాయి. పెద్దవాళ్లు అటు చూడకుండా ఉన్నప్పుడు, ఆటకాయితనంతో, తొమ్మిదేళ్ల పిల్ల మే, చెల్లెలు అగాథాను వాల్ట్‌లో బంధించేసింది. బోల్టులు వేసేసింది. కాంబినేషన్ నాబ్‌ను తిప్పేసింది. అంతకు ముందు తాత ఆడమ్స్ ఆ పని చేయటం చూసిందామె.

బాంకు ముసలి యజమాని పరుగెత్తుకుంటూ వచ్చి, ఓ క్షణం హాండిల్‌ను పట్టుకుని తిప్పే ప్రయత్నం చేశాడు. "ఇప్పుడు తలుపు తెరవడం కష్టం" అన్నాడు దడదడలాడుతూ. "గడియారానికి కీ ఇవ్వలేదు. కాంబినేషన్ కూడా సెట్ చెయ్యలేదు."

అగాథా తల్లి పిచ్చెక్కినట్టు ఏడవసాగింది.

"ఉష్!" అన్నాడు ఆడమ్స్. వణుకుతున్న తన చేతిని పైకెత్తుతూ "అందరూ ఒక్కక్షణం నిశ్శబ్దంగా ఉండండి"అంటూ "అగాథా!" అని పెద్దగా పిలిచాడు. "నా మాట వినబడుతూందా?"

ఆ నిశ్శబ్దంలో ఆ పిల్ల చీకటిగదిలో భయంతో గుక్కపట్టి ఏడుస్తున్న ధ్వని చాలా అస్పష్టంగా వినవచ్చింది.

"అయ్యో, నా తల్లీ!"-అంటూ పెద్ద శోకం పెట్టిందా తల్లి. "అది భయంతో చచ్చిపోతుంది. తలుపు తెరవండి, తలుపు విరగ్గొట్టండి. ఏదైనా చెయ్యండి."

"తలుపును తెరవగల మనిషి లిటిల్ రాక్‌లో ఉన్నాడు. అది దూరం" అన్నాడు ఆడమ్స్ వణుకుతున్న గొంతుతో. "అయ్యో! స్పెన్సర్, మనమిప్పుడేం చేద్దాం? ఆ పసిది అక్క డెంత సేపో ఉండలేదు. పీల్చటానికి అంత గాలి కూడా ఉండదు. ఆ పైన భయంతో స్పృహ కూడా తప్పవచ్చు."

అగాథా తల్లి పిచ్చెక్కినట్టు చేతుల్తో వాల్ట్ తలుపు బాదసాగింది. డైనమైట్ పేలిస్తే తలుపు ధ్వంసమవుతుందని ఎవరో ఓ పిచ్చి సలహా ఇచ్చారు.

అన్నీబెల్ జిమ్మీ వంక తిరిగింది. ఆమె పెద్దకళ్లల్లో వ్యాకులత తొంగిచూసింది కాని, నిరాశ లేదు. తను ఆరాధించే మగవాడి శక్తిని మించినదేదీ ఉండదని స్త్రీ నమ్మకం.

"నువ్వేమైనా చెయ్యగలవా, రాల్ఫ్... ప్రయత్నం చెయ్యరాదూ?"

పెదాల మీదా, కళ్లలోనూ మృదువైన చిరునవ్వు వర్తిస్తుంటే అతను ఆమె వంక చూశాడు.

"అన్నీబెల్, నువ్వు పెట్టుకున్న ఆ గులాబిపువ్వు నాకివ్వు" అన్నాడు అతను.

తను వింటున్నది నిజమేనా అనుకుందామె ఓ క్షణం. అయినా, తన గుండె మీద తగిలించుకున్న గులాబీని, పిన్ను తీసి, అతని చేతిలో పెట్టింది. జిమ్మీ దాన్ని తన వెస్ట్ పాకెట్‌లో పెట్టుకున్నాడు. కోటును విడిచేశాడు. చొక్కా చేతులు మోచేతుల దాకా మడిచాడు. ఆ పనితో రాల్ఫ్ డి. స్పెన్సర్ గతించాడు. ఆ జాగాలో జిమ్మీ వాలెంటైన్ వచ్చి తిష్ఠ వేసుకున్నాడు.

"మీరందరూ తలుపు దగ్గర నుంచి దూరం వచ్చెయ్యండి" అని ఆజ్ఞాపించా డందరినీ.

తన సూట్‌కేస్‌ను అతను టేబుల్ మీద పెట్టాడు. దాన్ని పూర్తిగా తెరిచాడు. ఆ క్షణం నుండి అతనికి తన చుట్టుపక్కలున్న మనుషుల స్పృహ లేదు. వింతైన, మెరుస్తున్న తన పనిముట్లను వేగంగా, చేతికి అందుబాటులో ఉండేట్టు పేర్చాడు, సన్నగా ఈల వేసుకుంటూ, పనిలో నిమగ్నమైనప్పుడు అది అతనికి అలవాటు.

మహానిశ్శబ్దంగా, కదలకుండా, మంత్రముగ్ధులైనట్లు అందరూ అతని వంక చూడసాగారు.

మరుక్షణంలో జిమ్మీ చేతిలోని డ్రిల్ మెత్తగా స్టీల్ తలుపును కోయసాగింది. పదినిమిషాల్లో తన పాత దొంగతనపు రికార్డును బద్దలు కొడుతూ, బోల్టులను తప్పించి, తలుపు తెరిచాడతను.

అగాథా వాల్ట్‌లో స్పృహ తప్పి పడుంది కానీ సురక్షితంగా ఉంది. తల్లి ఆమెను తన చేతుల్లోకి తీసుకుంది.

జిమ్మీ వాలెంటైన్ కోటు వేసుకున్నాడు. రెయిలింగ్ దాటి బాంకు సింహద్వారం వైపు నడిచాడు. అతనలా వెళ్తూంటే, తనకు సుపరిచితమైన గొంతు, దూరం నుంచి, "రాల్ఫ్!" అని పిలుస్తున్నట్టనిపించింది. అతనిక సంకోచించలేదు.

తలుపు దగ్గర ఓ లావుపాటి మనిషి అతని దారికడ్డంగా నిలబడ్డాడు.

"హాల్లో, బెన్!" అన్నాడు జిమ్మీ. ఇంకా అతని ముఖంలో ఆ వింత చిరునవ్వు మాయమవ్వలేదు. "ఎలాగో చివరకు వచ్చావన్నమాట! పద వెళ్దాం. ఇప్పుడింక నేనెక్కడున్నా తేడా లేదులే."

అప్పుడు బెన్ ప్రైస్ విచిత్రంగా ప్రవర్తించాడు. "నువ్వు పొరపడినట్లున్నావు, స్పెన్సర్! నిన్ను గుర్తించానని నమ్మక. నీ గుర్రబ్బండి నీ కోసం నిరీక్షిస్తోంది. వెళ్లు" అన్నాడతను.

ఆ మాటని బెన్ ప్రైస్ వెనక్కి తిరిగి, వీధిలో మెల్లగా నడుచుకుంటూ వెళ్లిపోయాడు.

■